క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌పై నేడు మేధావుల సమావేశం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని స్టే ఇన్ హోటల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

వెల్మకన్నెలో విజృంభిస్తున్న చికున్‌గున్యా

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో చికున్‌గున్యా వ్యాధి విజృంభిస్తోంది. గ్రామ పరిధిలోని చర్చి ఏరియాలో ఒక్కటి, రెండు కుటుంబాలకు మొదలై ఏడు, ఎనిమిది కుటుంబాల వరకు చికెన్‌గున్యా వ్యాధితో బాధపడుతున్నారు. బాధిత కుటుంబాలు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ వైద్యం అందించాలని, గ్రామంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితులను శిక్షించాలి

నల్లగొండ టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం అనంతారం గ్రామంలో జరిగిన బాలిక హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియొద్దీన్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపాలన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ప్రజాసంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీకి ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేయాలి

చిట్యాల: నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీని బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేసి సంస్థను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం చిట్యాలలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, బొల్లూరు లింగయ్య, దేశగాని నాగరాజు, సత్తయ్య, నర్సింహ పాల్గొన్నారు.

పూల రవీందర్‌కు బీసీ సంఘాల మద్దతు

నల్లగొండ టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పూల రవీందర్‌కు తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు తెలిపారు. ఆదివారం నల్లగొండలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ భవన్‌లో బీసీ కులాల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు కంది సూర్యనారాయణ, కోశాధికారి నల్ల సోమ మల్లన్న, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశ బోయిన శంకర్, నకిరేకంటి కాశయ్య గౌడ్, పసుపులేటి సీతారాములు, ఆదినారాయణ, వాసుదేవుల వెంకట నరసయ్య, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ బోనాలు

నకిరేకల్: నకిరేకల్ మున్సిపాలిటీ శివారులోని 7వ వార్డు బాబాసాహెబ్ గూడెంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో భాగంగా ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణానికి దైద రవీందర్ రూ.15,1,16 ఆర్థిక సాయం అందజేశారు. వేడుకల్లో నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, చింతల శ్రీనివాస్, సల్లోజు శ్రీనివాస్, వంటిపాక శ్రీను, వెంకన్న, తాండురు లక్ష్మయ్య, చెవుగోని రాములు, వంటిపాక జీవన్, భూపతి వెంకటనారయణ, గద్దపాటి విజయ్, శ్రవణ్, పందిరి సతీష్, చెనగాని రాజశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో చికెన్ మేళా



చికెన్ ఫ్రై, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు, వ్యాపారస్తులు

నార్కట్‌పల్లి: జనాల్లో బర్డ్‌ఫ్లూ భయాన్ని తొలగించేందుకు నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం వెంకాబ్ కోళ్ల పరిశ్రమ, చికెన్ వ్యాపారస్తుల ఆధ్వర్యంలో చికెన్ మేళా నిర్వహించారు. వ్యాపారస్తులు తమ సొంతంగా 200 కిలోల చికెన్ ఫ్రై చేయించి, రెండు వేల కోడి గుడ్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఉచితంగా పంపిణీ చేశారు.

శ్రీపాల్‌రెడ్డి సతీమణి ప్రచారం

నల్లగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన భర్త పింగళి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆయన సతీమణి నవిత నల్లగొండలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పద్మ ఫణి కుమార్, సుంకరి భిక్షం గౌడ్, కిరణ్ కుమార్, కళావతి, వనం పద్మ, రాధ, రజని, నిర్మల, విజయ్ కుమార్ రెడ్డి, గాదె వెంకట్ రెడ్డి, రామ కృష్ణారెడ్డి, కరుణాకర్ రెడ్డి, తీగల శంకరయ్య, భాస్కర్, శ్రీను, నాగయ్య పాల్గొన్నారు.

అడుగంటుతున్న ప్రాజెక్టు.. తడారుతున్న పొలాలు



వెలవెలబోతున్న ప్రాజెక్టు కుడికాల్వపై ఉన్న అడ్లూరు-ఊట్కూరు గండెమాగు



కనిష్ట స్థాయికి చేరిన శాలిగౌరారం ప్రాజెక్టులోని నీటి మట్టం

- ప్రస్తుతం 8 అడుగులకు చేరిన శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం
- విద్యుత్ మోటార్లతో అక్రమంగా ఎగువ ప్రాంతానికి నీటి తరలింపు
- సాగునీరందక ఎండుతున్న ఆయకట్టు పంట పొలాలు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం కనిష్టానికి పడిపోవడంతో ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఆయకట్టు రైతులు అయోమయంలో పడ్డారు. పంట సాగుకోసం అప్పులు తెచ్చి వేల రూపాయలు ఖర్చు చేసిన రైతులు ఆ పంటలు సాగునీరందక కళ్ల ముందే ఎండిపోతుంటే తట్టుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఆయకట్టులో వరి పంటలు కరుకు, చిరుపొట్ట దశల్లో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇప్పటికే పంటలు ఎండుతుండటం, ఎండల తీవ్రత కూడా పెరుగుతుండటంతో సాగునీటిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

వందల సంఖ్యలో విద్యుత్ మోటార్ల ఏర్పాటు..

శాలిగౌరారం ప్రాజెక్టు ఆవరణలో వందల సంఖ్యలో విద్యుత్ మోటార్లు ఏర్పాటయ్యాయి. ప్రాజెక్టులో ఉన్న నీటిని ప్రాజెక్టు ఆవరణలో తవ్విన బావుల ద్వారా అక్రమంగా ఎగువభాగానికి తరలిస్తుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకు కనిష్టానికి పడిపోతోంది. దీనికి తోడు ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రధాన కుడి, ఎడమ కాల్వల వెంట ఉన్న విద్యుత్ మోటార్ల ద్వారా సుదూర ప్రాంతాల్లోని ఎగువ భూములకు నీటి తరలింపు జరుగుతుండటంతో కాల్వల వెంట నీరు ప్రవహించక ఆయకట్టుకు భూములకు సాగునీరందలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఆయకట్టు రైతులు పంటలను సాగుచేసి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

21 అడుగుల నీటి సామర్థ్యం..

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటిసామర్థ్యంతో 5వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ప్రాజెక్టు పరిధిలో మండలంలోని శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాల్లో ఆయకట్టు ఉంది. కానీ ప్రస్తుతం కేవలం శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం గ్రామ పంచాయతీల పరిధిలోని పంట భూములకు కూడా సాగు నీరందడంలేదు. 5 వేల ఎకరాల ఆయకట్టు 2వేల ఎకరాలకు పడిపోయిందంటే సాగునీటి పరిస్థితి ఏవిధంగా ఉందో ఊహించవచ్చు.



ఆయకట్టు పరిధిలో ఎండిన వరి చేను

ప్రాజెక్టును పట్టించుకునేనాథుడే లేడు



ప్రాజెక్టులోకి ఎగువన ఉన్న మూసీనదినుండి నీరువచ్చే విషయాన్ని పట్టించుకున్ననాథుడే లేడు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయడంతోనే ఈసారి పంటలకు సాగునీటి కష్టాలు వచ్చాయి. ప్రాజెక్టులో సరిపడా నీరునిల్వ లేకపోవడంతో యాసంగి పంటను సాగుచేసి పంట చేతికి అందకుండానే కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

– చామల జితేందర్‌రెడ్డి, రైతు, శాలిగౌరారం

వరిచేను ఎండిపోయింది



యాసంగి పంట సాగుకు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల జరగడంతో ఎంతో ఆశపడి ఐదెకరాలు కౌలుకు తీసుకొని వరిపంట సాగుచేశాను. కానీ పంటసాగు ప్రారంభం నుండే సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. సాగునీరు అందడం రోజురోజుకు కష్టంగా మారడంతో పంటమొత్తం ఎండిపోయింది.

– వేముల కిరణ్‌కుమార్, రైతు, శాలిగౌరారం

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ప్రాజెక్టులో ప్రస్తుతం 8 అడుగుల నీరు నిల్వ ఉంది. ఉన్న నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలి. మూసీనది ఎగువ భాగం నుంచి వరద నీటిని ప్రాజెక్టులోకి మళ్లించే విషయాన్ని జిల్లా నీటి పారుదలశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం చర్యలు చేపడుతాం. – రాములు, ఇరిగేషన్ ఏఈ, శాలిగౌరారం ప్రాజెక్టు

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవసరం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న జానారెడ్డి

నల్లగొండ టూటౌన్: యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి అన్నారు. ఎంజీ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడోత్సవ్ బహుమతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్లకు బానిస కాకుండా క్రీడా పోటీలు ఆడడం ద్వారా శారీరక దేహదారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఏబీవీపీ ఖేలో భారత్ క్రీడోత్సవ్ –2025 కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను క్రీడల్లో భాగస్వాములు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రాంత సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్, నల్లగొండ విభాగ్ ప్రముఖ్ కత్తుల మోహన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చత్రపతి చౌహాన్, సుర్వి మణికంఠ, మానేశ్వర్, రాజేష్, ప్రత్యూష, హనుమాన్, మోహన్, వెంకటేశ్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

కనగల్: మండల పరిధిలోని రేగట్టె గ్రామంలో పంచాయతీ కార్మికుడు జిల్లా విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పంచాయతీ కార్యదర్శి నర్సిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో నిరసన తెలిపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ్‌పై కార్యదర్శి కక్ష గట్టి వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై కార్యదర్శి నర్సిరెడ్డిని వివరణ కోరగా గ్రామ పంచాయతీకి సంబంధించి పనులు చేయాలని చెప్పినందుకే తనపై కోపం పెంచుకున్నాడని, తాను ఎక్కడా అవినీతి చేయలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ఎల్లేష్, నర్సింహ, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, పాండు, శంకర్, నాగేశ్వరి, పారిజాత, కిరణ్, భిక్షం, సాగర్ పాల్గొన్నారు.

• జీవాలకు మేతగా వరి చేను



కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామంలో నీరులేక ఎండిపోతున్న వరి పొలంలో మేస్తున్న జీవాలు – కట్టంగూర్

బీజేపీ నాయకుల ఎన్నికల ప్రచారం



నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రచారం చేస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆదివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట గుర్రం చెన్నకేశవరెడ్డి, తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అలుగుపల్లి పాపిరెడ్డి, ఇరుగు శ్రీరాములు, బత్తిని భాస్కర్ గౌడ్, కంచనపల్లి విజయ్ కుమార్, చనగాని యాదయ్య గౌడ్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కేతేపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆపార్టీ నాయకులు ఆదివారం కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు చెరుకు రోషయ్య తాడోజు నర్సింహాచారి, కూరెల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



మునుగోడులో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మునుగోడు: మునుగోడులో బీజేపీ నాయకుడు దుబ్బ జెల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన దశదిన కర్మకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చెందాలు వేసుకొని రూ.20వేలు, ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వీరమళ్ల సురేష్ మరో రూ. 10వేలు.. మొత్తం రూ.30వేల ఆర్థికసాయం ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, జిల్లా కార్యదర్శి బోడిగే అశోక్ గౌడ్, మాదగోని నరేందర్, బండారి యాదయ్య, పగిళ్ల భిక్షం, సతీష్, యాదయ్య, శేఖర్ పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని శివాజీ నగర్‌లో నివాసం ఉంటున్న అలిసేరి శ్రావణి మూసీ రోడ్డులో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె కుమారుడు 18 నెలల నవనీత్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు ఆదివారం నిరుపేద కుటుంబానికి రూ. 22,200 ఆర్థికసాయం అందజేశారు. వారిలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, కందగట్ల సందీప గోలి పద్మ, నరేందర్, నాగచారి ఉన్నారు.

వైద్యఖర్చుల నిమిత్తం..

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ మండల కేంద్రంలో చేనేత కార్మికుడు బొల్ల రామచంద్రానికి ఇటీవల రెండు కిడ్నీలు చెడిపోయి అనారోగ్యం పాలయ్యాడు. డయాలసిస్ వైద్య ఖర్చుల నిమిత్తం, కుటుంబ పోషణకుగాను గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలు రూ.25వేల ఆర్థికసాయాన్ని ఆదివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో రాపోలు గోపినాథ్, సూరేపల్లి సత్తయ్య, కొంగరి పాండు, కొంగరి నరహరి, పగిళ్ల శంకర్, గుర్రం ప్రదీప్ కుమార్, మండల శ్రవణ్, సింగం భాస్కర్, మెట్టు లక్ష్మణ్, సూరేపల్లి శ్రీనివాస్, సూరేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు చేయిస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



కంటి పరీక్ష చేయించుకున్న వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దంపతులు

మునుగోడు: వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయిస్తామని, అవసరమైన వారికి వెంటనే ఆపరేషన్లు చేయించి కంటి సమస్యలు లేకుండా చూస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ అన్నారు. ఆదివారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శంకర కంటి ఆస్పత్రి వైద్యులచే మూడో విడత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఎమ్మెల్యేతో పాటు అతని భార్య లక్ష్మి హాజరై కంటి పరీక్షలు చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 1781 మందికి కంటి పరీక్షలు చేయించి 324 మందికి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా, మండల, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మునుగోడు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరిశీలించారు. శనివారం రాత్రి తన క్యాంపు కార్యాలయంలో బసచేసిన ఆయన ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో మండల కేంద్రంలో వాకింగ్‌చేస్తూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం రోడ్డు పక్కనే ఉన్న హోటల్‌లో టిఫిన్ చేసి టీ తాగారు.

బీఆర్‌ఎస్ పార్టీకి శ్రీనివాస్ రాజీనామా

శాలిగౌరారం: తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నాయకత్వంలో పనిచేయలేక బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు రైతు సమన్వయ సమితి మండల మాజీ కోఆర్డినేటర్, గురుజాల మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి పార్టీని బలోపేతం చేస్తే.. పార్టీలో కష్టపడిన వారికి కనీస గుర్తింపు ఇవ్వకపోగా, తనను అవమానాలకు గురిచేశారని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి

శాలిగౌరారం: రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసి నిజాయితీని నిరూపించుకోవాలని బీజేపీ సూర్యాపేట జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేశ్ అన్నారు. ఆదివారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రుణమాఫీ కోసం గాంధీభవన్ మెట్లెక్కిన రైతు తోట యాదగిరితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రుణమాఫీ జరగకపోవడంతో లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజల ఆగ్రహానికి గురికాకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్, షేక్ సయ్యద్ పాల్గొన్నారు.

మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థులకు అవార్డులు



అవార్డులతో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

నకిరేకల్: ఇటీవల నిర్వహించిన శ్రీనివాసారామానుజన్ మాథ్స్,సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో నకిరేకల్ పట్టణంలోని న్యూవిజన్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 2, 4 ర్యాంకులు సాధించిన వారిలో జి.వేదితారెడ్డి(6వతరగతి), పి.రాజ్‌కుమార్(8వతరగతి), జిల్లా స్థాయిలో 2, 3వ ర్యాంకుల సాధించిన వారిలో సీహెచ్ చంద్రశ్రీ వందన్ (7వ తరగతి), ఎస్.సుశ్రుత (6వతరగతి), జిల్లా స్థాయి కన్సోలేషన్ అవార్డుల పొందిన వారిలో భవ్యశ్రీ, ఎస్.శ్రేయస్‌రాజ్(8వ), పి.రాజ్‌కుమార్ (9వ), ఎస్.సాయిశ్రీజ(3వ), ఎం.అశ్విత(6వ), ఎం. సూర్యతేజ(8వ), దీక్షిత(7వ), సీహెచ్ రుద్రవేణి(9వ), బి.ప్రవళిక(9వ), జశ్వంత్(9వ తరగతి) ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ అభినందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకున్న కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

కేతేపల్లి: రాష్ట్రస్థాయి షోటేషాన్ కరాటే వారియర్స్ పోటీల్లో కేతేపల్లి మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదివారం నల్లగొండలోని ఆంజనేయ గార్డెన్స్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో రాచకొండ యస్మిత రెండో స్థానంలో నిలవగా, ఉయ్యాల ధనలక్ష్మి, దాసరి సుచరిత మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారని హెచ్‌ఎం వోలేటి రాధాకృష్ణమాచార్యులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ మండలంలోని చర్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 2003– 04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు బోధించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని అక్కెనపల్లి హైస్కూల్‌లో 2008–2009లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శిరబోయిన రాజు, అక్కెనపల్లి, శ్రవణ్, దైద అనిల్, మత్స్య సురేష్, అశోక్, సత్యనారాయణ, రఫీ, రాణి, రజిత, రాధిక, మమత, మంజు, అంజు, శ్యామల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అక్కెనపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేధిస్తున్న యూరియా కొరత

- యూరియా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- మునుగోడు మండలంలో 900 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం
- ఇప్పటివరకు 400 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా



మునుగోడులోని ఫర్టిలైజర్ దుకాణంలో నిల్వ ఉన్న గడ్డలు కట్టిన యూరియా

మునుగోడు: గత కొద్ది రోజులుగా రైతులను యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. వరి చేలు పొట్టకు వచ్చిన దశలో వేయాల్సిన యూరియా అందుబాటులో లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. మునుగోడు మండల వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో దాదాపు 9,087 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో 400 ఎకరాల వరకు ఎండిపోగా.. మిగిలిన 8500 ఎకరాలకు 900 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. కానీ ఇప్పటివరకు మండలానికి 400 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయింది. మిగిలిన 500 మెట్రిక్ టన్నులు రాకపోవడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు.

సరఫరా చేసేది కూడా గడ్డలు కట్టినదే..

యూరియాను వారంలో ఒకటి రెండు లారీల చొప్పున సరఫరా చేస్తున్నారు. అయితే సరఫరా చేసినా యూరియా అంతా పూర్తిగా గడ్డలు కట్టి ఉండటంతో రైతులు దానిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ ధర రూ. 266 ఉండగా గోదాం నుంచి నుంచి వ్యాపారులకే రూ. 296కు బస్తా చొప్పున విక్రయిస్తుండడంతోపాటు రవాణా చార్జీలు చెల్లించాల్సి వస్తుందని, ఈ యూరియాని తీసుకొచ్చి తాము అప్పుల పాలు కాలేమని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అవసరమైన యూరియా సరఫరా చేయించాలని రైతులు కోరుతున్నారు.

గడ్డలు కట్టిన యూరియా అమ్ముతున్నారు

వరి పొలానికి యూరియా వేసేందుకు ఫర్టిలైజర్ దుకాణాలకు వద్దకు వెళ్తే పూర్తిగా గడ్డలు కట్టిన యూరియా ఇస్తున్నారు. ఇదేంటని అడిగితే మాకు ఇదే సరఫరా అవుతుందని చెబుతున్నారు. మిగతా ఏ దుకాణాల్లో కూడా యూరియా లేదని చెబుతున్నారు. గతంలో ఎకరానికి రెండు బస్తాలు వేసే యూరియా ఇప్పుడు ఒక్క బస్తా మాత్రమే వేయాల్సి వస్తోంది. యూరియా కొరత తీవ్రంగా ఉంది.

– ఉడుగుండ్ల సైదులు, రైతు, ఇప్పర్తి